క్లుప్తంగా

ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ



అర్తమూరులో ఆరోగ్యశ్రీ కార్డులు పంపిణీ చేస్తున్న స్థానిక ప్రజాప్రతినిధులు

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి మండలంలోని అర్తమూరు గ్రామస్తులకు వైఎస్సార్ ఆరోగ్యశ్రీ స్మార్ట్ కార్డులను సర్పంచ్ పొన్నాడ కుమార్, ఎంపీటీసీ పతివాడ గురునాయుడు గురువారం పంపిణీ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ ద్వారా వైద్యం కోసం రూ.5 లక్షల వరకు ఉన్న వ్యయపరిమితిని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రూ.25 లక్షలకు పెంచారన్నారు. ఆరోగ్యశ్రీ ద్వారా సీఎం జగన్ పేదల ఆరోగ్యానికి మరింత భరోసా కల్పించారన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణకు కృషి



విలేకరులతో మాట్లాడుతున్న సీఐ మురళీరావు, ఎస్‌ఐలు గంగరాజు,మోహన్‌రావు

శృంగవరపుకోట: ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ స్థానిక సర్కిల్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తామని సీఐ మురళీరావు చెప్పారు. ఎస్.కోట సీఐగా మురళీరావు, ఎస్‌ఐలుగా సీహెచ్.గంగరాజు, ఏ.మోహన్‌రావు ఇటీవల బాధ్యతలు తీసుకున్నారు. ఎస్‌ఐలతో కలిసి గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో సీఐ మురళీరావు మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ప్రత్యేక నిఘాఉంచామన్నారు. గ్రామాల్లో అసాంఘిక కార్యక్రమాలు ఏం జరిగినా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎస్.కోట పట్టణంలో ట్రాఫిక్ సమస్య వేధిస్తోందని, క్రమంగా మెరుగుపరుస్తామని చెప్పారు. డయల్ 100కి అందిన ప్రతీ ఫిర్యాదుపై నేరుగా స్పందిస్తామని తెలిపారు.

దేవస్థానం బోర్డు మెంబర్ మృతి



గంట్యాడ వెంకటలక్ష్మి(ఫైల్)

చీపురుపల్లి: స్థానిక కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం బోర్డు మెంబర్ గంట్యాడ వెంకటలక్ష్మి గురువారం మృతి చెందారు. అనారోగ్య కారణంగా విశాఖపట్టణంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో గత మూడు రోజులుగా ఆమె చికిత్స పొందుతున్నారు. ఆరోగ్య పరిస్థితి విషమించడంతో గురువారం ఉదయ మృతి చెందారు. ఆమె భర్త స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద డాక్యుమెంట్ రైటర్‌గా పని చేస్తుండగా కుమారుడు ఎంబీబీఎస్, కుమార్తె ఇంటర్మీడియట్ చదువుతున్నారు.

రచ్చబండ నిర్మాణానికి స్థలపరిశీలన

మెరకముడిదాం: మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో రచ్చబండ నిర్మాణాని రాష్ట్ర క్షత్రియపరిషత్ సభ్యుడు కె.ఎస్.ఆర్.కె.ప్రసాద్, పీఏసీఎస్ అధ్యక్షుడు కె.గుర్రాజు, కొమ్ముశంకరరావు, వార్డుమెంబరు పిసిని ఆదియ్య గురువారం స్థల పరిశీలన చేశారు. కాలనీలో అందరికీ అందుబాటులో ఉన్న చోట రచ్చబండ నిర్మిస్తామని చెప్పారు. సంబంధిత పనులకు త్వరలోనే భూమి పూజ చేయనున్నట్లు పేర్కొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యం

- సీఎం జగన్ మహిళా పక్షపాతి
- ఇచ్చిన హామీ ప్రకారం డ్వాక్రా సంఘాలకు రుణమాఫీ
- వైఎస్సార్ ఆసరా సంబరాల్లో ఎమ్మెల్యే శ్రీనివాసరావు



లబ్ధిదారులకు వైఎస్సార్ ఆసరా చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

జామి: మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించడమే లక్ష్యంగా సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అనేక పథకాలు అమలు చేస్తున్నారని ఎస్.కోట ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక యల్లారమ్మ ఆలయం వద్ద గురువారం నిర్వహించిన వైఎస్సార్ ఆసరా సంబరాలకు ఆయన అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల ముందు డ్వాక్రా సంఘాల మహిళలకు నాలుగు విడతల్లో రుణమాఫీ చేస్తామని జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారని, అధికారంలోకి వచ్చిన తర్వాత మాట నిలబెట్టుకున్నారని అన్నారు. వైఎస్సార్ ఆసరా పథకం కింద ఎస్.కోట నియోజకవర్గంలోని లబ్ధిదారులకు నాలుగు విడతల్లో మొత్తం రూ.155.72 కోట్లు అందించామని తెలిపారు. పేదల జీవన ప్రమాణాలు మెరుగుపరచడమే ధ్యేయంగా దేశంలో ఏ రాష్ట్రప్రభుత్వం అమలు చేయనన్ని సంక్షేమ పథకాలను మన రాష్ట్రంలో సీఎం జగన్ అమలు చేస్తున్నారన్నారు. అధిక శాతం పథకాలకు సంబంధించిన నగదును మహిళల ఖాతాల్లోనే ప్రభుత్వం జమచేస్తోందని వివరించారు. ప్రతీ నెల ఒకటో తేదీ ఉదయాన్నే వలంటీర్లు తలుపుతట్టి వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు రూ.3 వేల పింఛన్‌ను అందిస్తున్నారని, ఇక్కడ తప్ప ఏరాష్ట్రంలోనూ రూ.3 వేల పింఛన్ ఇవ్వడం లేదన్నారు. నాడు-నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలల ను కార్పొరేట్ స్కూళ్లకు ధీటుగా తీర్చిదిద్దామని, ఇంగ్లిష్ మీడియం చదువులు ప్రవేశపెట్టామని పేర్కొన్నారు. ఎన్నికలు సమీపిస్తుండడంతో టీడీపీ నేతలు ప్రజలను మోసం చేయడానికి సిద్ధమయ్యారని, వారి మాటలను నమ్మవద్దని సూచించారు. ఎంపీపీ సబ్బవరపు అరుణ,జెడ్పీటీసీ గొర్లె సరయు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గొర్లె రవికుమార్, డీసీసీబీ డైరెక్టర్ పాండ్రంకి సంజీవి,రాష్ట్ర గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ డైరెక్టర్ చలుమూరి సత్యారావు, వైస్ ఎంపీపీలు గేదెల వెంకటరావు, ఎన్నింటి విజయలక్ష్మి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచారక్ గుడివాడ రాజేశ్వరరావు, మండల జేసీఎస్ కన్వీనర్ శీరెడ్డి చందునాయుడు, వైఎస్సార్‌సీపీ మండల యువజన విభాగం అధ్యక్షుడు పిన్నింటి రవికుమార్, ఎంపీడీఓ ఎం.సతీష్, వెలుగు ఏరియా కో-ఆర్డినేటర్ ఆదయ్య, జామి మండల ఏపీఎం మధుమహేష్‌తో పాటు కొత్తవలస,ఎల్.కోట,ఎస్.కోట ఏపీఎంలు, పలుగ్రామాల సర్పంచ్‌లు,ఎంపీటీసీలు వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రాణం ఉన్నంతవరకు జగన్ వెంటే

మా గ్రూపునకు రూ.7లక్షల50 వేలు రుణం మాఫీ అయింది. వైఎస్సార్ ఆసరా, చేయూత పథకం కింద అందిన లబ్ధితో ఆవులు కొనుగోలు చేశాను. పాల అమ్మకంతో వచ్చిన ఆదాయంతో కుటుంబానికి చేదోడుగా నిలుస్తున్నాను. పేద ప్రజలు బతుకులు బాగుపడ్డాయంటే అది జగన్‌మోహన్‌రెడ్డి చలువే. మరింత బాగుండాలంటే మరల ఆయన సీఎం కావాలి. మాట మార్చని, మడమ తిప్పని నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి. నా ప్రాణం ఉన్నంతవరకు జగన్‌వెంటే ఉంటా.

– దాసరి సోమాలమ్మ, డ్వాక్రా మహిళ, చింతాడ

రూ.49 వేల రుణం మాఫీ అయింది



వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా నాకు రూ.49,200 రుణం నాలుగు విడతల్లో మాఫీ అయింది. అమ్మఒడి, ఇతర పథకాలు అందుతున్నాయి.సీఎం జగన్ అమలు చేస్తున్న పథకాలు మాలాంటి పేదలకు ఎంతో ఉపయోగ పడుతున్నాయి. జగన్‌కు రుణపడి ఉన్నాం.

– కోళ్ల నాగలక్ష్మి, లబ్ధిదారు, ఆర్.బి.పురం

రూ.1.80 లక్షల లబ్ధి



మా కుటుంబానికి సీఎం జగన్ ప్రవేశపెట్టిన పథకాల ద్వారా సుమారు రూ.1.80 లక్షలు లబ్ధి చేకూరింది. వైఎస్సార్ ఆసరా ద్వారా రూ.41,200 రుణం మాఫీ అయింది. చేయూత, రైతు భరోసా,విద్యా దీవెన పథకాలు వచ్చాయి. నాభర్త ఆరోగ్య శ్రీద్వారా కంటి ఆపరేషన్ చేయించుకున్నాడు. ఈ ప్రభుత్వం పేదలకు అండగా నిలుస్తోంది.

– ఎల్ల అచ్చియ్యమ్మ, లబ్ధిదారు, కలగాడ



ఆసరా సంబరాలకు హాజరైన డ్వాక్రా సంఘాల సభ్యులు

క్రీడల్లో రాణించే వారికి ఉజ్వల భవిష్యత్



గజపతినగరం: క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య

- ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య

గజపతినగరం: క్రీడల్లో రాణించే వారికి ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో గజపతినగరం నియోజక వర్గ స్థాయి 'ఆడుదాం-ఆంధ్రా' క్రీడా పోటీలను గురువారం ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో క్రీడాభివృద్ధికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎనలేని కృషి చేస్తున్నారని, గ్రామీణ ప్రాంత క్రీడాకారులను ప్రోత్సహించేందుకు 'ఆడుదాం-ఆంధ్రా' పేరుతో అయిదు క్రీడాంశాల్లో రాష్ట్రవ్యాప్త టోర్నమెంట్ నిర్వహిస్తున్నారని చెప్పారు. విద్యార్థులు చదువుతో పాటు అన్నిరంగాల్లో రాణించాలని సూచించారు. జెడ్పీటీసీ సభ్యుడు గార తవుడు, గజపతినగరం,బొండపల్లి ఎంపీపీలు బెల్లాన జ్ఞానదీపిక, చల్లా చల్లంనాయుడు, ఏఎంసీ చైర్మన్ వేమలి ముత్యాలనాయుడు, పీఏసీఎస్ చైర్మన్ కె.ఆదినారాయణ, సీనియర్ నేతలు మండల సురేష్, బెల్లాన త్రినాథరావు,సీఐ ఎన్.వి.ప్రభాకరరావు, జేసీఎస్ కన్వీనర్ కె.సుబ్రహ్మణ్యం, నాలుగు మండలాల ఎంపీడీఓలు, పీఈటీలుపాల్గొన్నారు.

క్రీడలకు ప్రోత్సాహం



శృంగవరపుకోట: క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎంపీపీ సోమేశ్వరరావు, వైస్ ఎంపీపీ సుబ్బలక్ష్మి

శృంగవరపుకోట: దేశంలో ఎక్కడా లేని విధంగా ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి క్రీడలకు ప్రోత్సాహం ఇస్తున్నారని ఎంపీపీ సండి సోమేశ్వరరావు, వైస్ ఎంపీపీ ఇందుకూరి సుబ్బలక్ష్మి అన్నారు. ఎస్.కోట నియోజకవర్గస్థాయి 'ఆడుదాం-ఆంధ్రా' క్రీడా పోటీలను పట్టణంలోని డాక్టర్ వరలక్ష్మి పీఈటీ కళాశాలలో గురువారం వారు ప్రారంభించారు. గ్రామీణ క్రీడాకారులను గుర్తించి వారిని జాతీయ, అంతర్జాతీయ వేదికలపై నిల్పోబెట్టే ప్రయత్నం ప్రభుత్వం చేస్తోందని, దీనివల్ల యువతకు ఉపాధి, ఉద్యోగం, గుర్తింపు, హోదా, సామాజిక, ఆర్థిక భద్రత, భరోసా వస్తాయన్నారు.తొలిరోజు పురుషులకు జరిగిన పోటీల్లో బ్యాడ్మింటన్‌లో ఎస్.కోట జట్టు విజేతగా నిలిచింది. కొత్తవలస జట్టు ద్వితీయ స్థానం, వేపాడ జట్టు తృతీయ స్థానాలు సాధించగా, వాలీబాల్‌లో జామి జట్టు విజేతగా నిలవగా, ఎల్.కోట జట్టు ద్వితీయ స్థానంలో, ఎస్.కోట జట్టు తృతీయ స్థానంలో నిలిచింది. ఖోఖోలో వేపాడ ప్రథమస్థానం, కొత్తవలస జట్టు ద్వితీయ స్థానం, ఎల్.కోట జట్టు తృతీయ స్థానంలో నిలిచాయి.

సంక్షిప్తంగా...

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి

చీపురుపల్లి/ శృంగవరపుకోట/కొత్తవలస: రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని ఆ సంఘం ప్రతినిధులు కోరారు. ఈ మేరకు గురువారం చీపురుపల్లి, ఎస్.కోట,కొత్తవలస తాలూకా యూనిట్‌ల పరిధిలోని పెన్షనర్లు ఆయా మండలాల తహసీల్దార్ కార్యాలయాల వద్ద ధర్నా చేశారు. డీఆర్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని, 11వ పీఆర్సీ ఎరియర్స్ చెల్లించాలని, హెల్త్‌కార్డుల ద్వారా అన్ని వ్యాధులకు గుర్తింపు పొందిన ఆస్పత్రుల్లో వైద్యం అందివ్వాలని, మెడికల్ రీయింబర్స్‌మెంట్ పరిధిని రూ.2 లక్షల నుంచి రూ. 5 లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు.

టైటిలింగ్ యాక్టు రద్దు చేయాలి

కొత్తవలస: ప్రభుత్వం నూతనంగా అమల్లోకి తీసుకొచ్చిన ఏపీ ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్-2022ను రద్దు చేయాలని కోరుతూ కొత్తవలస జూనియర్ సివిల్ కోర్టు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు తహసీల్దార్ శ్రీనివాసమిశ్రాకు గురువారం వినతిపత్రం అందజేశారు. న్యాయవాదులు మాట్లాడుతూ ఈయాక్టు ప్రకారం భూహక్కులు కోల్పోయే ప్రమాదం ఉందని, దిగువ,మధ్య తరగతి వారికి నష్టం వాటిల్లు తుందని అన్నారు. బార్ అసోసియేషన్ ప్రతినిధులు గొడుగుల మహేంద్ర, జి.వి.ఎస్.గిరిబాబు, తూర్పాటి శివాజీ, ఓ.వి.మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

29న ఉపాధి శిక్షణకు ఎంపికలు

చీపురుపల్లి: పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ఇప్పిలి అనంతం, ఆపార్టీ జిల్లా కార్యదర్శి వలిరెడ్డి శ్రీనివాస నాయుడు చెప్పారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎంపీడీఓ జి.గిరిబాలతో కలిసి వారు మాట్లాడారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పించడంలో భాగంగా జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఏ)ఆధ్వర్యంలో వివిధ అంశాల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. ఈనెల 29న స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఎంపికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. బీటెక్, బీఎస్సీ కెమిస్ట్రీ, ఐటీఐ, డిప్లమాతో పాటు ఇంటర్, డిగ్రీ చదువుకున్న యువత అర్హులని చెప్పారు. దీనికి సంబంధించిన సమాచార ప్రతులను అన్ని సచివాలయాల నోటీసు బోర్డుల్లో పెట్టామని పేర్కొన్నారు. అర్హులకు మూడు నెలల పాటు ఉచిత వసతి, భోజనం సదుపాయం కల్పించి శిక్షణ ఇస్తారని, అనంతరం ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. చీపురుపల్లి పరిసర ప్రాంతాల యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

27న మెరకముడిదాంలో...

మెరకముడిదాం: మండలంలోని నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం డీఆర్‌డీఏ ద్వారా వివిధ అంశాల్లో ఉచితంగా శిక్షణ ఇవ్వనుందని, ఇందుకు సంబంధించిన ఎంపికలు ఈ నెల 27న మెరకముడిదాం వెలుగు కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఏపీఎం కెల్ల ఉమామహేశ్వరరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న యువత ఉదయం 10 గంటలకు వెలుగు కార్యాలయం వద్ద హాజరుకావాలని సూచించారు.

సీఎం బహిరంగ సభను విజయవంతం చేయాలి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

చీపురుపల్లి: రానున్న సార్వత్రిక ఎన్నికలకు శంఖారావం పూరించేందుకు సమరానికి 'సిద్ధం' పేరుతో ఈ నెల 27ర భీమిలిలో నిర్వహించనున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి బహిరంగ సభను పార్టీ శ్రేణులంతా విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ఇప్పిలి అనంతం, పార్టీ జిల్లా కార్యదర్శి వలిరెడ్డి శ్రీనివాసనాయుడు కోరారు. చీపురుపల్లిలో గురువారం వారు విలేకరులతో మాట్లాడుతూ బహిరంగ సభకు రాష్ట్ర విద్యాశాఖామంత్రి బొత్స సత్యనారాయణ, జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ పిలుపు మేరకు మండలంలోని అన్ని పంచాయతీల నుంచి నాయకులు, కార్యకర్తలు తరలిరావాలనికోరారు. నాయకులు బెల్లాన త్రినాథరావు, చందక గురునాయుడు, రేవ్వల సత్తిబాబు, దాలయ్య, లక్ష్మణ తదితరులు పాల్గొన్నారు.

జంతు సంక్షేమ పక్షోత్సవాలు

లక్కవరపుకోట: మండలంలోని మార్లాపల్లి గ్రామంలో జంతు సంక్షేమ పక్షోత్సవాలను ఎల్.కోట పశువైద్యాధికారి కె.గాయత్రీదేవి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామంలో పశువైద్య శిబిరం ఏర్పాటు చేసి, పశువులకు చూడిద తనిఖీలతో పాటు కృత్రిమ గర్భధారణ ఇంజెక్షన్‌లు చేశారు. పలువురు సచివాలయ పశు సహాయకులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఎడ్ల పరుగు ప్రదర్శన



కొత్తవలస: మింధివలసలో ఎడ్ల పరుగు ప్రదర్శన



వేపాడ: వల్లంపూడిలో పరుగుతీస్తున్న ఎడ్లు

కొత్తవలస: మింధివలస గ్రామంలో మరిడిమాంబ తీర్థం సందర్భంగా గురువారం నిర్వహించిన అంతర్ జిల్లాల ఎడ్ల బళ్ల పరుగు పందెం పోటీలు ఉల్లాసంగా సాగాయి. పలు జిల్లాల నుంచి 14జతల ఎడ్లు ఈపోటీల్లో పాల్గొన్నాయి. నర్సంపేటకు చెందిన ముమ్మిన శివతేజకు చెందిన ఎడ్ల బండి ప్రథమస్థానంలో నిలవగా, లెక్కలపల్లికి చెందిన పైడితల్లిమ్మ, చుక్కపల్లికి చెందిన మైచర్ల శివకుమార్, నర్సంపేటకు చెందిన ముమ్మిన కనకరాజు,కలగాడకు చెందిన పోలిపర్తి రామునాయుడు,తుమ్మికాపల్లికి చెందిన పంచముఖ ఆంజనేయకు చెందిన ఎడ్లబళ్లు తరువాత వరుస స్థానాల్లో నిలిచాయి.విజేతలకు గ్రామానికి చెందిన బిల్డింగ్ సెంట్రింగ్ కార్మికుల ఆర్థిక సహాయంతో రూ.50 వేల నగదు బహుమతిని అందజేశారు. అంతకుముందు అమ్మవారికి గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేసి, మొక్కులు చెల్లించుకున్నారు.

వల్లంపూడిలో..

వేపాడ: మండలంలోని వల్లంపూడిలో సాంబమూర్తి తీర్థం సందర్భంగా గురువారం సాయంత్రం ఎడ్ల పరుగు ప్రదర్శన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో విజయనగరం, అనకాపల్లి జిల్లాలకు చెందిన 14 జతల ఎడ్లు పాల్గొన్నాయి. వల్లంపూడికి చెందిన ఏడువాక సత్తిబాబు ఎడ్లు ప్రథమ స్థానంలో, వావిలపాడుకు చెందిన గండి వెంకటరావు ఎడ్లు ద్వితీయ స్థానం, వల్లంపూడి సిద్ధి వినాయక ఎడ్లు తృతీయ స్థానంలో నిలిచాయి. వరుసుగా అయిదు స్థానాల్లో నిలిచిన విజేతలకు నిర్వాహకులు నగదు బహుమతి అందజేశారు. తీర్థం సందర్భంగా సాంబమూర్తి ఆలయంలో గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేశారు.

తీరు మార్చుకోకుంటే చర్యలు



సచివాలయ ఉద్యోగులకు సూచనలు చేస్తున్న ఎంపీడీఓ శేషుబాబు

శృంగవరపుకోట: మండలంలోని పలు సచివాలయాల ఉద్యోగులు ప్రభుత్వ కార్యక్రమాలు, వలంటీర్ల సమావేశాలకు స్థానిక ప్రజాప్రతినిధులను ఆహ్వానించడం లేదని, సమాచారం అందించడం లేదన్న ఫిర్యాదులు వస్తున్నాయని, ఉద్యోగులు తీరు మార్చుకోకుంటే చర్యలు తప్పవని ఎంపీపీ సొండి సోమేశ్వరరావు హెచ్చరించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం మండల సర్వసభ్యసమావేశం నిర్వహించారు. పలు అంశాలపై అధికారులతో ఎంపీపీ సమీక్షించారు. ఎంపీడీఓ శేషుబాబు, వైస్ ఎంపీపీ సుబ్బలక్ష్మి, జెడ్పీటీసీ వెంకటలక్ష్మి, మండల అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఓటే వజ్రాయుధం



గజపతినగరం: 'మై ఓట్, మై ఫ్యూచర్' పేరుతో గజపతినగరం బాలుర హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన సెల్ఫీ బాక్స్ వద్ద ఫొటో దిగిన ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య



చీపురుపల్లి: చీపురుపల్లిలో అధికారులు, విద్యార్థులతో కలిసి ర్యాలీ చేస్తున్న ఆర్డీఓ శాంతి



బొండపల్లి: నెలివాడ హైస్కూల్‌లో ముగ్గుల పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటే వజ్రాయుధమని,పౌరులంతా రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును సద్వినియోగించుకోవాలని చీపురుపల్లి ఆర్డీఓ బి.శాంతి, పలువురు తహసీల్దార్‌లు, ఇతర అధికారులు , కళాశాలల అధ్యాపకులు, పాఠశాలల ఉపాధ్యాయులు అన్నారు. చీపురుపల్లి, ఎస్.కోట, గజపతినగరం నియోజకవర్గాల్లోని తహసీల్దార్ కార్యాలయాలు, ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాలలు, పలు పోలింగ్ కేంద్రాల్లో జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. ఓటు హక్కు ఆవశ్యకత, వినియోగంపై అవగాహన కల్పించేందుకు విద్యార్థులతో ర్యాలీలు నిర్వహించి, మానవ హారాలు ఏర్పాటు చేశారు. సీనియర్ ఓటర్లను సత్కరించారు. ప్రలోభాలకు లొంగకుండా ఓటు హక్కును వినియోగించుకుంటామని ఓటర్లతో బీఎల్‌ఓలు ప్రతిజ్ఞ చేయించారు. విద్యార్థులకు ముగ్గులు, వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. – సాక్షి నెట్‌వర్క్



శృంగవరపుకోట: ఎస్.కోటలో ర్యాలీ చేస్తున్న అధికారులు, విద్యార్థులు



కొత్తవలస: తహసీల్దార్ కార్యాలయం వద్ద సీనియర్ ఓటర్లను సన్మానిస్తున్న తహసీల్దార్ శ్రీనివాసమిశ్ర తదితరులు



లక్కవరపుకోట: ఎల్.కోటలో ర్యాలీ నిర్వహిస్తున్న తహసీల్దార్ కల్యాణచక్రవర్తి, అధికారులు



జామి: తహసీల్దార్ కార్యాలయంలో ప్రతిజ్ఞ చేస్తున్న తహసీల్దార్ హేమంత్‌కుమార్, సిబ్బంది



వేపాడ: సోంపురం హైస్కూల్‌లో ప్రతిజ్ఞ చేస్తున్న ఉపాధ్యాయులు



గజపతినగరం: గజపతినగరంలో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, విద్యార్థులు



దత్తిరాజేరు: తహసీల్దార్ కార్యాలయం వద్ద సీనియర్ సిటిజన్స్‌ను సన్మానిస్తున్న తహసీల్దార్ రమేష్



బొండపల్లి: బొండపల్లి హైస్కూల్‌లో సీనియర్ ఓటర్లను సన్మానిస్తున్న తహసీల్దార్ ప్రసాదరావు



చీపురుపల్లి: చీపురుపల్లి గాంధీబొమ్మ జంక్షన్ వద్ద మానవహారం ఏర్పడి ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు



గుర్ల: ర్యాలీ చేస్తున్న గుర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు